తొల్లూరు నాగేశ్వరరావు  ఆధునిక నీతికథలు

సాయంకాలం ఆఫీసు వొదిలాక ఓ ఫ్రెండ్ ఇంటికెళ్లి, ఆ తర్వాత ద్దరూ కల్సి నిజాంక్లబ్ కెళ్లి, ఓ గంటసేపు 'తీర్థప్రసాదాలు' సేవిస్తూ కులాసాగా కబుర్లు చెప్పుకొని, ఇంకా అయిదు నిముషాలకు ఎనిమిది అవుతుందనగా ఇంటికొచ్చాడు మురళీమోహన్‌రావు తేలిపోయే కళ్ళతో, బరువెక్కిన మొహంతో, చెదిరిన క్రాపుతో.

"ఇప్పటిదాకా ఆఫీసుందా!" అంది భార్య కనుబొమలతో వెక్కిరిస్తూ.

"నేను ఆఫీసర్ని. ఇరవై నాలుగు గంటలూ నాకు ఆఫీసు డ్యూటీయే!– ఆఫీసులో వున్నా ఆఫీసు అవతల వున్నా" అన్నాడు మురళీమోహన్‌రావు టి. వి. కి మూడు మీటర్ల దూరంలో ఫ్రేంకుర్చీలో కూర్చుంటూ.

"ఈ కోతలకేంలెండి! కొయ్యడానికి మార్కెట్‌లో సొరకాయలు కూడా మండిపోతున్నాయి. భోజనం వడ్డించమంటారా? నిషా దిగేవరకూ వుంటారా!" అంది రామేశ్వరి డైనింగ్‌టేబుల్ మీద పళ్ళాలు సర్దుతూ.

"అసలు ఆడవాళ్ళతో వున్న చిక్కే ఇది. మొగుడు గంట లేటుగా ఇంటికొస్తే ఏ బార్‌కో, క్లబ్‌కో వెళ్ళి కుతికెమీద తాగొచ్చాడని అనుకుంటారు. అదే గంటముందుగా ఆఫీసు వొదిలి, ఆరు పెగ్గులు ఏ బార్‌లోనో పుచ్చుకొని, బుద్ధిమంతుడిలా అయిదుంబావుకు ఇంటికొస్తే అవగింజలో అరవైఆరో వంతు కూడా అనుమానపడరు" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు మురళీ మోహన్.

పళ్ళెంలో కూరలూ, అన్నం వడ్డించి – తాను వడ్డించుకుంది రామేశ్వరి. అప్పటివరకూ భార్యాభర్తల మధ్య వాతావరణం మబ్బువిడిచిన వెన్నెల్లాగానే వుంది.

"మా అన్నయ్య ఉత్తరం వ్రాశాడు" అంది రామేశ్వరి నిశ్శబ్దాన్ని నిలువునా చీలుస్తూ.

"ఏమని?" అన్నట్టు ఆమెకేసి చూశాడు మురళీమోహన్‌రావు పకోడితో వేయించిన వంకాయవేపుడు కలుపుకుంటూ.

"అదే పంటడబ్బు ఓ నెలరోజుల్లో పంపిస్తాడట. రావాల్సిన బిల్లులు ఇంకా రాలేదట. మీకంత అర్జంటయితే ఎక్కడయినా తీసుకొని పంపిస్తానన్నాడు."

నోట్లో ముద్ద పెట్టుకోవడం మానేశాడు మురళీమోహన్‌రావు

"ఈ కూరగాయల కబుర్లకేమొచ్చె! మూడు నెల్లనాడు ధాన్యం అమ్మాగా ఆ డబ్బుకోసం రెండుత్తరాలు రాసి, ముగ్గురికి కబురు పెడితే—ఇదా సమాధానం! మీవాళ్ళంతా ఇంతే! అప్పు దొరికిందంటే అమ్మాయి పెళ్ళి కుదిరినంత ఆనందపడతారు; అది తీర్చాలంటే పుత్రుడు పోయినంత దుఃఖపడతారు." అన్నాడు మురళీమోహన్‌రావు తుస్కారంగా.

తన వాళ్ళను అంత తేలిగ్గా మాట్లాడేసరికి రామేశ్వరి మొహం కోపోద్రేకాలతో తాటిపండులాగా ఎర్రబడింది. అమె కళ్ళల్లో నీళ్ళు కదిలాయి; ముక్కుపుటాలు అదిరాయి; కనుబొమలు ముడిపడ్డాయి. ఒకపట్టాన గొంతులోంచి మాటలు పూడిరాలేదు. ఒక నిముషంపాటు మొగుడికేసి కళ్ళప్పజెప్పి తీక్షణంగా చూస్తూ కూర్చుంది.

"మా వాళ్ళంతా యింతేనా? ఎంత మాటన్నారు? మా వాళ్ళు మీకేం డబ్బు ఎగవేశారు? పెళ్ళికి వారంరోజులకు ముందుగానే కట్నండబ్బు మీ నాయన పుచ్చుకున్నాడుగా! పెళ్ళిరోజు మీ చెల్లెలికి పెట్టిన రత్నావళి రంగు కలనేత కంచిపట్టు చీర బాగోలేదని మూతి మూడువంకర్లు తిప్పితే, మళ్ళీ పన్నెండొందలు పెట్టి మరో రంగులో కొనిచ్చాం, గుర్తులేదూ? మీ అమ్మా, నాన్నా రాక్షసులు. పిసినారి వాళ్ళు. ఎప్పుడైనా కోడలు పండక్కి ఇంటికెళ్ళితే జాకెట్టుగుడ్డ కూడా పెట్టరు. నాలుగు కూరలొండితే నాలుగు రూపాయలు అయిపోతాయనే రకం. మీ అక్కచెల్లెళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు. ధనియాల ఖాతాగాళ్ళు. ఏదో గురివెంద గింజ సామెతగా.. మీ వాళ్ళల్లో యిన్ని లోపాలు పెట్టుకొని మావాళ్ళ నంటారా?" అంది రామేశ్వరి ఆడపులిలా గాండ్రుపెడుతూ.

మురళీమోహన్‌రావు కపాళంలోకి ఎక్కిన విస్కీ నిషా ముప్పాతిక మువ్వీసం దిగొచ్చింది. ఆ నిషా స్థానే కోపం ఆక్రమించింది.

"మీ నాన్న మోసగాడు. కట్నం తాలూకు పదివేలు ఇవ్వకుండానే 'ఇదుగో, ఇదుగో' నంటూ పరలోకానికి టపాకట్టేశాడు. శోభనంనాడు స్కూటర్

కొనిస్తానని మీ అమ్మ బింకాలు పలికి, శోభనమై పదేళ్ళు గడిచినా, ఇద్దరు పిల్లలు పుట్టినా ఇప్పటికీ అతీగతీ లేదు. పైసాకు పైసా ముడుపుకట్టి కూతుళ్ళకు దోచిపెడు తూంది. మీ అన్నయ్య సంగతీ, తమ్ముల సంగతీ నా నోటిమీదుగా నేను చెప్ప నక్కర్లేదు. వాళ్ళను గురించి వూళ్ళోవాళ్ళే చెబుతారు."

"మీ నాన్నే మోసగాడు. మీ అమ్మ మోసగత్తె"

"మీ అమ్మ"

"మీ వాళ్ళు...."

"మీ గుంపు...."

—అ విధంగా భార్యాభర్తలు రోషంగా, జేవురించిన ముఖాలతో పోట్లాడుకున్నారు.

అన్నంతినే కంచాన్ని వొదిలేసి చివుక్కున లేచింది రామేశ్వరి.

మురళీమోహన్‌రావు కంచంలోనే చేతులు కడిగి, బెడ్‌రూమ్‌లో పడు కున్నాడు దుస్తులు మార్చుకోకుండానే.

ఆ రాత్రి ఆ భార్యాభర్తల మధ్య మరి మాటలు లేవు.

రామేశ్వరి పిల్లల బెడ్‌రూమ్‌లోనే పడుకుంది తనవాండ్లను తల్చుకుంటూ.

మురళీమోహనరావు ఒంటరిగా డబుల్‌కాట్స్ మీద అటూ ఇటూ దొర్లుతూ ఏ అర్ధరాత్రికో నిద్రకొరిగాడు.

'మమ్మీ! మమ్మీ!' అంటూ పిల్లలు కేకలేస్తూ ఇంట్లో తిరుగుతూంటే చటుక్కున లేచాడు మురళీమోహన్‌రావు.

ఇంట్లో రామేశ్వరి లేదు. ఓ చీటీ వ్రాసిపెట్టి ఆ రోజు ఉదయం కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కిందామె. ఆ చీటీలో ఇట్లా వుంది. "నేను మా అన్నయ్య దగ్గర కెళుతున్నాను, రెండ్రోజుల్లో పంటడబ్బు తీసుకొస్తాను—రామేశ్వరి"

*తన భార్యేతరపు బంధువుల్ని భర్త నిందించరాదు*